చేప ప్రసాదం పంపిణీకి సర్వం సిద్ధం

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ఫలహారాలను పంపిణీ చేసిన స్వచ్ఛంద సంస్థలు

నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాంష్‌యాదవ్, పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న ఫిషరీస్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్

అబిడ్స్, సుల్తాన్‌బజార్, జూన్ 7 : మృగశిర కార్తె ప్రవేశం సందర్భంగా శనివారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో చేప ప్రసాదం పంపిణీకి అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. శనివారం ఉదయం ప్రారంభం కానున్న చేప ప్రసాదం పంపిణీని పురస్కరించుకుని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. జీహెచ్‌ఎంసీ అధికారులు ఎగ్జిబిషన్ మైదానాన్ని చదును చేయించడంతో పాటు మొబైల్ మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. మైదానంలో పారిశుధ్య పరిరక్షణకు సిబ్బంది విధులలో పాల్గొనేలా చర్యలు తీసుకున్నారు. చేప ప్రసాదం స్వీకరించేందుకు అవసరమైన చేపలను కొనుగోలు చేసేందుకు గాను మత్స్య శాఖ మొదటి సారిగా టైమ్ స్లాట్ టోకెన్‌ల విక్రయాలను ప్రారంభించారు. 32 కౌంటర్‌ల ద్వారా చేప ప్రసాదాన్ని పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. చేప ప్రసాదం కోసం చేప పిల్లలు సిద్ధంగా ఉంచేలా ఏర్పాట్లు చేశారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి ఆర్టీసీ 133 ప్రత్యేక బస్సులను నడపనుంది. మూడు వైద్య ఆరోగ్య శిబిరాలు, మూడు మొబైల్ వైద్య బృందాలను అందుబాటులో ఉంచనున్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. చేప ప్రసాదం పంపిణీ సందర్భంగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.

టోకెన్‌లను విక్రయిస్తున్న అధికారులు

జలమండలి ఆధ్వర్యంలో మంచినీటి ప్యాకెట్‌లను పంపిణీ చేసేందుకు అధికారులు సిద్ధం చేశారు. భద్రతాపరంగా సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు మెటల్ డిటెక్టర్‌లను ఏర్పాటు చేసి తనిఖీలు చేసిన అనంతరం మైదానంలోకి అనుమతించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాంష్ యాదవ్ ఆధ్వర్యంలో అబిడ్స్ ఏసీపీ చంద్రశేఖర్‌ల నేతృత్వంలో బేగంబజార్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, జోన్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్‌ల ఇన్‌స్పెక్టర్‌లు బందోబస్తు చేపట్టనున్నారు.

హైదరాబాద్ జైస్వాల్ సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం చేస్తున్న జైస్వాల్ సమితి ప్రతినిధులు

భారీగా తరలి వచ్చిన ఉబ్బస వ్యాధిగ్రస్తులు...

మృగశిర కార్తె ప్రవేశం సందర్భంగా బత్తిని సోదరులు చేప ప్రసాదాన్ని పంపిణీ చేయనుండటంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి అస్తమా వ్యాధిగ్రస్తులు అప్పుడే తరలి వచ్చారు. చేప ప్రసాదం స్వీకరించేందుకు వచ్చిన అస్తమా వ్యాధిగ్రస్తులు మైదానంలోని షెడ్‌లలో సేద తీరుతున్నారు.

ఉచిత అన్నదానం, ఫలహారం పంపిణీ ప్రారంభం..

బత్తిని సోదరులు ఉచితంగా పంపిణీ చేసే చేప ప్రసాదం పంపిణీకి వచ్చే ఉబ్బస వ్యాధిగ్రస్తులకు అన్నదానం, ఫలహారాల పంపిణీని స్వచ్ఛంద సంస్థలు ప్రారంభించాయి. అగ్రవాల్ సేవా సమాజ్, బద్రివిశాల్ పన్నాలాల్ పిత్తి ట్రస్ట్, హైదరాబాద్ జైస్వాల్ సమితి, ఉత్తర భారతీయ నాగరిక్ సేవా సమాజ్, పంజాబి సేవా సమితి, గౌడ సేవా సంఘంతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు ఫలహారం, అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

బండి సంజయ్‌ని కలిసిన నాయకులు

లోక్‌సభ ఎన్నికలలో కరీంనగర్ ఎంపీగా ఎన్నికైన బండి సంజయ్‌ని కార్వాన్ నియోజకవర్గం బీజేపీ నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. జియాగూడ కార్పొరేటర్ బోయిని దర్శన్, నాయకులు దేవర శ్రీనివాస్, కాంత అర్జున్‌కుమార్ పాల్గొన్నారు. – మెహిదీపట్నం

బోనాలను వైభవంగా నిర్వహించాలి

మెహిదీపట్నం, జూన్ 7 : గోల్కొండ కోట జగదాంబిక ఎల్లమ్మ ఆలయం నుంచి ప్రారంభమయ్యే తెలంగాణ ఆషాఢ మాస బోనాలను వైభవంగా నిర్వహించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీ సలహాదారు సిరుగుమల్లె రాజు వస్తాద్ కోరారు. శుక్రవారం శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఆయన కలిసి గోల్కొండ బోనాల నిర్వహణపై చర్చించారు. తొమ్మిది వారాల పాటు జరిగే ఈ బోనాల పూజలకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలని స్పీకర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి స్పందించిన స్పీకర్ సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

గోల్కొండ బోనాల చైర్మన్‌గా అవకాశం కల్పించండి

చారిత్రాత్మక గోల్కొండ కోట జగదాంబిక ఎల్లమ్మ ఆలయంలో ప్రారంభం అయ్యే ఆషాఢ మాసం బోనాల కోసం ఏర్పాటు చేసే బోనాల కమిటీ చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించాలంటూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ మహిళా నాయకురాలు శోభాపాండే శుక్రవారం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి ఎన్నో ఏళ్లుగా సేవలు అందిస్తున్నామని, పార్టీ పెద్దలు గుర్తించి అవకాశం కల్పించాలని కోరారు. – మెహిదీపట్నం

వివిధ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 7: ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ కాలేజ్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ అండ్ మీడియా ఎడ్యుకేషన్ (డీడీఎంఎస్ కోఫేమ్)లో వివిధ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల చైర్‌పర్సన్ డాక్టర్ రమాప్రభ, ప్రిన్సిపాల్ కె. విజయ తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఈ కోర్సులను అందించనున్నట్లు చెప్పారు. బీఏ కర్ణాటక సంగీతం (ఫుల్ టైం), ఎంఏ కర్ణాటక సంగీతం (పార్ట్ టైం ఇన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్) కోర్సులలో చేరేందుకు కేవలం మహిళలే అర్హులని పేర్కొన్నారు. కర్ణాటక వోకల్‌లో ఒక సంవత్సరం బ్రిడ్జి కోర్సు, డెవోషనల్ మ్యూజిక్ (సంకీర్తన)లో ఆరు వారాల సర్టిఫికెట్ కోర్సు, వీణ, వయోలిన్, కీబోర్డ్, ఫ్లూట్‌లలో ఒక సంవత్సరం సర్టిఫికెట్ కోర్సు, సౌందర్య లహరి, ఆర్‌జే, వాయిస్ ఓవర్, యాక్టింగ్, యాంకరింగ్, న్యూస్ రీడింగ్, రిపోర్టింగ్, ఎడిటింగ్, డబ్బింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో సర్టిఫికెట్ కోర్సు, టెక్చర్ ఆర్ట్, రెసిన్ ఆర్ట్, లిప్పన్ ఆర్ట్, క్యాండిల్ మేకింగ్, తంజావూర్ పెయింటింగ్, కార్టూనింగ్, డాల్స్ మేకింగ్, క్రోచెట్, స్టోరీ టెల్లింగ్ విత్ ఫ్లాష్ కార్డ్స్, బ్యూటీషియన్, హెయిర్ స్టైల్స్, కౌన్సెలింగ్ ఫర్ చిల్డ్రెన్ అవేర్‌నెస్ తదితర అంశాల్లో సర్టిఫికెట్ కోర్సులను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ అన్ని కోర్సుల్లో చేరేందుకు మహిళలతో పాటు పురుషులు కూడా అర్హులని వివరించారు. ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఇతర వివరాలకు 944176 8811, 9393949415 నంబర్లలో సంప్రదించాలన్నారు.

షాదీముబారక్ చెక్కులు అందజేత

ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడానికి కృషి చేస్తున్నామని కార్వాన్ ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొయినుద్దీన్ అన్నారు. శుక్రవారం హకీంపేట్‌లోని ఎస్‌ఎస్ ఫంక్షన్ హాల్‌లో షేక్‌పేట్ మండలానికి చెందిన 143 షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే కౌసర్‌మొయినుద్దీన్ నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ నసీరుద్దీన్‌తో కలిసి అందజేశారు. – మెహిదీపట్నం, జూన్ 7

దీపాదాస్ మున్షీకి అభినందనలు

టీపీసీసీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని గాంధీ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గాంధీభవన్‌కు విచ్చేసిన సందర్భంగా చార్మినార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి కె. వెంకటేశ్ మర్యాదపూర్వకంగా కలిసి ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక ఎంపీ స్థానాలలో విజయం సాధించడంతో ప్రత్యేక అభినందనలు తెలిపారు. – అబిడ్స్, జూన్ 7

ఎంఎన్‌వో, ఎఫ్‌ఎన్‌వోల సమస్యలు పరిష్కరించాలి

- మంత్రి దామోదర రాజనర్సింహను కలిసిన ఉస్మానియా దవాఖాన ఔట్ సోర్సింగ్ సిబ్బంది

మంత్రి దామోదర రాజ నర్సింహను కలిసిన ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

సుల్తాన్‌బజార్, జూన్ 7: ఉస్మానియాలో 8 సంవత్సరాలుగా ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న ఎంఎన్‌వోలు, ఎఫ్‌ఎన్‌వోల సమస్యల పరిష్కరించాలని ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం(ఐఎన్‌టీయూసీ 3194)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొందుగుల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆయన ఉస్మానియా దవాఖాన ఔట్ సోర్సింగ్ సిబ్బందితో కలిసి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహను మర్యాద పూర్వకంగా కలిసి సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉస్మానియా దవాఖానలో పేషెంట్ కేర్‌లో పని చేస్తున్న ఎంఎన్‌వోలు, ఎఫ్‌ఎన్‌వోలను అకారణంగా శానిటేషన్ కార్మికులుగా పనిచేయాలని అంటున్నారని ఆయన మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రస్తుతం కార్మికులు పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ విధానంలోనే కొనసాగించాలని ఆయన కోరారు. ఈ విషయమై మంత్రి దామోదర రాజనర్సింహ సానుకూలంగా స్పందించారని తెలిపారు. సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వేణుగో పాల్ గౌడ్, రాష్ట్ర నాయకులు నర్సిరెడ్డి, కృష్ణ, వినోద్, సంగీత, సాయిలత, రేవతి, రేణుక, షరాఫత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

గోవధ శాలలను తక్షణమే మూసివేయాలి..

ఇందిరాపార్కులో ధర్నా నిర్వహిస్తున్న దేశీ గోవంశ రక్షణ సంవర్ధన్ సమితి ప్రతినిధులు

కవాడిగూడ, జూన్ 7: రాష్ట్రంలో చట్ట విరుద్ధంగా కొనసాగుతున్న గోవధ శాలలను తక్షణమే మూసివేయాలని తెలంగాణ రాష్ట్ర గోరక్ష సహ ప్రముఖ్ జి. రమేశ్, ఇసంపల్లి వెంకన్న, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాలివాహన పండరీనాథ్, కన్వీనర్ శివరామ్, బాలకృష్ణ గురుస్వామి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆక్రమణలో ఉన్న గోచర భూములను విముక్తి చేసి ప్రతి జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో గోషాలలను ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో దేశీ గోవంశ రక్షణ సంవర్ధన్ సమితి, విశ్వహిందూ పరిషత్, గోరక్ష విభాగం సంయుక్త ఆధ్వర్యంలో గోరక్ష చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గో మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ.. గో ఆధారిత వ్యవసాయం చేస్తున్న రైతులకు తగిన ప్రోత్సాహకాలను అందించాలని అన్నారు. భాగ్యనగర్ బోరబండలోని బబ్బిగూడ నార్సింగి మొదలైన స్థలాలలో నిర్వహిస్తున్న పశువుల సంతలను తక్షణమే ఎత్తివేయాలని అన్నారు. ఆటోలు, లారీలు, క్లోజుడ్ కంటైనర్‌లో తరలిస్తున్న మాఫీయాపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ అనుమతులు లేని వందలాది కబేలాలను మూసివేయాలని, గోవులను గోవధ శాలలకు అక్రమంగా తరలిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, స్వామి కమలానంద భారతి, ఆలియామత్ మందిర్ అధ్యక్షుడు రామరాజు, గో ప్రేమికులు తదితరులు పాల్గొన్నారు

రాష్ట్రంలో పర్యాటకం అభివృద్ధి చేస్తాం : మంత్రి జూపల్లి

ఇబ్రహీంబాగ్‌లో తారామతి బారాదరిలో అధికారులతో మాట్లాడుతున్న పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

మెహిదీపట్నం, జూన్ 7 : రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం గోల్కొండ ఇబ్రహీంబాగ్‌లో ఉన్న తారామతి బారాదరిలో ఆయన టూరిజం ఎండీ రమేశ్ నాయక్, ప్రాజెక్ట్ జీఎం ఉపేందర్‌రెడ్డి, డిప్యూటీ మేనేజర్ సాంబశివరావులతో కలిసి పర్యటించారు. ముందుగా తారామతి బారాదరిలో హరిత హోటల్ రూమ్స్, హరిత రెస్టారెంట్, పుష్పాంజలి అంపీ థియేటర్, ఆడిటోరియం, స్విమ్మింగ్ పూల్, టాయిలెట్స్‌ను పరిశీలించిన మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులకు పలు సూచనలు చేశారు. అంతేకాకుండా హరిత రిసార్ట్స్ నిర్వహణపై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ ఉత్తమ సేవలు అందించడానికి కృషి చేయాలని అధికారులను మందలించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. తారామతి బారాదరిని మరింత అభివృద్ధిపరచడానికి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ పూర్తి అయినందున పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖలపై సమీక్షలు నిర్వహించి ప్రభుత్వ ఆదాయం పెంచడంతో పాటు పర్యాటకులు, సందర్శకులకు మెరుగైన వసతుల కల్పనపై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటకుల దృష్టిని ఆకర్షించడానికి భవిష్యత్‌లో గోల్కొండ ఫెస్టివల్‌ను నిర్వహించడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి అన్నారు.

నాంపల్లికోర్టులో ముగిసిన వైద్యశిబిరం



నాంపల్లి కోర్టు బార్ అసోషియేషన్, క్రిస్టిల్‌కొన్ ఆసుపత్రి నిర్వహణలో ఉచిత వైద్యశిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని నాంపల్లి కోర్టుల ఇన్‌చార్జి, జిల్లా జడ్జి సురేశ్ ప్రారంభించారు. జడ్జికి బీపీ పరీక్షను నిర్వహించారు. 350 మంది న్యాయవాదులకు ఉచితంగా వైద్య చికిత్సలు అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రాజ్యవర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, డా.శివప్రసాద్, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి అరుణకుమారి, సభ్యులు పాల్గొన్నారు. – నాంపల్లి కోర్టులు, నమస్తే తెలంగాణ

కులగణన చేపట్టి.. బీసీ రిజర్వేషన్లు పెంచాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎర్ర సత్యనారాయణ

ముషీరాబాద్, జూన్ 7: బీసీ కులగణనకు అనుకూలమంటూ జేడియూ చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామని, అదే దారిలో ఎన్డీలో కీలక భాగస్వామి టీడీపీ నడుచుకోవాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ అన్నారు. అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం కులగణన చేపట్టి రిజర్వేషన్లను పెంచాలని డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 23న నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బీసీ సంఘం రాష్ట్ర సర్వసభ్య కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించ తలపెట్టినట్లు తెలిపారు. కులగణన చేసి బీసీ రిజర్వేషన్‌లు పెంచిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు గుజ్జ కృష్ణ, మల్లేశ్‌యాదవ్, నీల వెంకటేశ్, సుధాకర్, రాజ్‌కుమార్, రామకృష్ణ, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి

ఎస్‌ఎం ముజీబ్‌హుస్సేనీకి వినతిపత్రం అందజేస్తున్న టీఎన్జీవో స్కూల్ ఎడ్యుకేషన్ యూనిట్ అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, కార్యదర్శి ఎం. భాస్కర్

సుల్తాన్‌బజార్, జూన్ 7: విద్యాశాఖలో జీవో 317 సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీఎన్జీవో సంఘాన్ని టీఎన్జీవో స్కూల్ ఎడ్యుకేషన్ యూనిట్ అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, కార్యదర్శి ఎం. భాస్కర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం నాంపల్లి గృహకల్పలోని టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ కార్యాలయంలో శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌ఎం ముజీబ్‌హుస్సేనీని వారు మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాఠశాల విద్యా శాఖలో జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్ ల సీనియారిటీని పరిరక్షించాలని, మిడ్ డే మీల్స్ పోస్టులతో పాటు తెలంగాణ రాష్ట్రంలో 10 డైరెక్టర్,10 సూపరింటెండెంట్, 20 సీనియర్ అసిస్టెంట్ పోస్టులను మంజూరు చేయాలని అన్నారు. ముజీబ్‌హుస్సేనీ మాట్లాడుతూ.. ఉద్యోగులకు ఎటువంటి నష్టం కలుగకుండా తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. టీఎన్జీవో స్కూల ఎడ్యుకేషన్ యూనిట్ కోశాధికారి ఎస్‌డీ ప్రేమ్‌కుమార్, ఉపాధ్యక్షుడు బి.రవి, రుగేశ్, సంయుక్త కార్యదర్శి జయంతి, కార్యవర్గ సభ్యులు ప్రియాదేవ్ ఠాకూర్, ముజాహిద్ అలీ, ప్రాథమిక సభ్యులు సుదర్శన్, రమేశ్, సోహైల్, బాబు, జంబయ్య, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో గో రక్షా చట్టం అమలుతోనే గోవధకు అడ్డుకట్ట

గో రక్షా సంఘం, వీహెచ్‌పీ నాయకులకు లవ్ ఫర్ కౌ మెమెంటోలను అందజేస్తున్న లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ చైర్మన్ జస్మత్ పటేల్, ట్రస్టీ రితేశ్ జాగిర్దార్ తదితరులు

సుల్తాన్‌బజార్, జూన్ 7 : రానున్న బక్రీద్ నేపథ్యంలో గోవధ జరుగకుండా ప్రభుత్వం, అధికారులు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ చైర్మన్ జస్మత్ పటేల్, ట్రస్టీ రితేశ్‌జాగి ర్దార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం గో రక్షా చట్టాన్ని రాష్ట్రంలో ఖచ్చితంగా అమలు చేయాలని కోరుతూ గో రక్షా సంఘాల ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌లో మహాధర్నాను నిర్వహించారు. ఈ ధర్నాలో ఆల్ ఇండియా గో సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు బాలక్రిష్ణ, క్షేత్ర గో సేవ ప్రముఖ్ ఆకుతోట రామారావు, విశ్వహిందూ పరిషత్ దక్షిణ భారత గో రక్షా ప్రముఖ్ టి.యాదగిరిరావు, ప్రాంత గోరక్ష ప్రముఖ్ వెంకన్న, అఖిల భారత హిందూ మహాసభ జాతీయ కార్యదర్శి స్వామి కమలేశ్ మహారాజ్, విజయవాడకు చెందిన వీర ధర్మజ స్వామి, ఢిల్లీకి చెందిన యోగానంద స్వామి, వీహెచ్‌పీ రామరాజు, శశిధర్‌లను లవ్ ఫర్ కౌ మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. సభ్యులు విజయరాం, డాక్టర్ గుమ్మడి వల్లీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం..

కవాడిగూడ, జూన్ 7: ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవరుచుకోవాలని బీఆర్‌ఎస్ గ్రేటర్ నాయకుడు రవీంద్ర కోక అన్నారు. ఈ మేరకు శుక్రవారం ముషీరాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గల రెయిన్‌బో హోంలో బీఆర్‌ఎస్ భోలక్‌పూర్ నాయకులు గజ్జల వినయ్, కొమ్ము రాజేశ్, చినుకు ఆధ్వర్యంలో విద్యార్థులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గడ్డం ప్రవీణ్ కుమార్, భూతముల ఆంజనేయులు, రాము గౌడ్, కిరణ్ కుమార్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

పూసస్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో...

పూసస్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని గోషాల వద్ద పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు, ముషీరాబాద్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే పూస రాజు హాజరై పేదలకు అన్నదానం చేశారు. ప్రతి నెలా పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పూసరాజు తెలిపారు. ఈయనతో పాటు ట్రస్ట్ ప్రతినిధులు సునంద, మణికాన్, యశస్వికాన్, వందన, దివ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

నాంపల్లి కోర్టులు, జూన్ 7 (నమస్తే తెలంగాణ) : నాంపల్లి కోర్టుల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక కేసుల పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలని కార్యదర్శి అరుణాకుమారి కోరారు. బార్ అసోసియేషన్ హాలులో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. కక్షీదారులకు నచ్చజెప్పి కేసుల పరిష్కారానికి దోహదపడాలని అన్నారు. సికింద్రాబాద్, మనోరంజన్, నాంపల్లి కోర్టుల్లోని అన్ని కోర్టులలో ఆమోదయోగ్యమైన కేసులను తొలగించేందుకు చేయూతనందించాలని తెలిపారు. చెక్ బౌన్స్, వివాహ సంబంధ, రోడ్డు ప్రమాదాలు, ఎక్సైజ్, సివిల్ తగాదాలు, తదితర కేసుల్లో రాజీ చేసుకునే వీలున్న కేసులను తొలగించుకునేందుకు ఇరువర్గాలకు చెందిన కక్షీదారుల్ని ఒప్పించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. న్యాయవాదుల కోసం ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్ ఉపయుక్తంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రాజ్యవర్ధన్ రెడ్డి, వైద్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు

రాంలీలా మైదానం స్థలం.. సంగం మందిరానికి అప్పగించాలి

ఎండీ రమేశ్‌నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంగం రామచంద్రజీ మఠం మఠాధిపతి రాహుల్‌దాస్ బాబా తదితరులు

మెహిదీపట్నం, జూన్ 7 : దేవాలయానికి చెందిన స్థలాన్ని దేవాలయం వారికి అప్పగించాలని కోరుతూ తెలంగాణ పర్యాటక శాఖ ఎండీ రమేశ్ నాయక్‌కు కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్ సంగం రామచంద్రజీ మఠం మఠాధిపతి రాహుల్‌దాస్ బాబా శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో లంగర్‌హౌస్ బస్తీ సంక్షేమం నాయకులు వినేష్ సింగ్, ఇంద్రసేనారెడ్డి, రవీందర్‌రెడ్డి, గడ్డి చంద్రశేఖర్, కోయల్‌కార్ గోవిందరాజ్, ఆరెళ్ల జగదీశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ ఎండీ రమేశ్‌నాయక్ మాట్లాడుతూ.. దేవాలయ భూమికి సంబంధించిన పత్రాలు ఉంటే ఇవ్వాలని సూచించగా రాహుల్‌దాస్ సంబంధిత పత్రాలను అందజేశారు.

నామినేటెడ్ పదవులలో ప్రాధాన్యత ఇవ్వాలి..



త్వరలో నియమించే నామినేటెడ్ పదవుల పంపకంలో టీపీసీసీ ఓబీసీ సెల్ సీనియర్ జనరల్ సెక్రటరీ పొల్కం శ్రీనివాస్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర మేరు యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూలం శంకర్, పొల్కం వినయ్‌రాజ్ నాగర్ కర్నూలు ఎంపీ మల్లు రవిని కోరారు. నూతనంగా ఎంపీగా ఎన్నికైన మల్లు రవిని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. పొల్కం శ్రీనివాస్‌కు చైర్మన్ పదవి ఇవ్వడంతో పాటు చట్ట సభలలో రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. – అబిడ్స్, జూన్ 7

అద్దెపై లీజు కొరకు ప్రకటన

కాచిగూడలో గల శ్రీ తుల్జాభవన్ ధర్మశాల నందు గల ఇంటి నం. 3-4-6/A-1ను (3) సంవత్సరములు అద్దెపై లీజుకు ఇచ్చుటకు తేదీ 24.06.2024 సోమవారం ఉ. 11.00 గంటలకు బహిరంగ వేలం జరుగును వేలంపాటలో పాల్గొనదలిచిన వారు రూ. 10,000/-లు డిపాజిట్ ఒక గంట ముందు వరకు చెల్లించి బహిరంగ వేలం నందు పాల్గొనవచ్చును వివరాలకు శ్రీ తుల్జాభవన్ ధర్మశాల కార్యాలయంలో సంప్రదించగలరు ఫోన్ : 040-27568345

యస్. అంజనారెడ్డి,
ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కార్యనిర్వహణాధికారి

వేటూరి ప్రభాకరశాస్త్రి సంస్మరణ సభ

ప్రభాకరశాస్త్రి చిత్రపటానికి నివాళుర్పించిన దేవీప్రసాద్

ముషీరాబాద్, జూన్ 7: చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా శుక్రవారం కవి, చరిత్రకారుడు వేటూరి ప్రభాకరశాస్త్రి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో బేవరేజస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ జీ దేవీప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రభాకర శాస్త్రి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గాయకుడు సీహెచ్ త్రినాథరావు, కేతవరపు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

న్యూ ఆగాపురలో వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

మెహిదీపట్నం, జూన్ 7 : నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి డివిజన్ న్యూ ఆగాపురాలో శుక్రవారం జీహెచ్‌ఎంసీ అధికారులు వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ ఆదేశాలతో ఎంఐఎం నాయకుడు జాఫర్‌ఖాన్, డీఈ శ్రీనివాస్‌తో కలిసి ఈ పనులను ప్రారంభించారు. రూ. 50 లక్షల నిధులతో చేపట్టిన ఈ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయడానికి కృషి చేస్తామని జాఫర్‌ఖాన్ తెలిపారు.

వృద్ధుడు అదృశ్యం



రూపాలాల్

గోల్నాక, జూన్ 7 : వాకింగ్‌కు వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై రవి కుమార్ తెలిపిన ప్రకారం.. నెహ్రూనగర్‌కు చెందిన రూపాలాల్ గురువారం ఉదయం వాకింగ్ కని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగిరాలేదు. బాధితుడి భార్య శాంతమ్మ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

గోల్నాక, జూన్ 7: రైలు ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ చిమ్నానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫలక్‌నుమా రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం ఉదయం ఓ వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొని అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.